సాక్షి
కుమురం భీం

సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



దసరాకు ఆర్టీసీ సిద్ధం

దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపనుంది. ఆదిలాబాద్ రీజియన్ లో పరిధిలో 412 బస్సులు తిప్పనున్నారు.

8లో ▸

ఉమ్మడి ఆదిలాబాద్ రిజిస్ట్రార్‌గా రవీందర్‌రావు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా ఎం.రవీందర్‌రావు నియామకం అయ్యారు. ఇదివరకు డీఆర్‌గా పనిచేసిన సీహెచ్ అశోక్‌కుమార్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో హైదరాబాద్ దక్షిణ డీఆర్‌గా ఉన్న రవీందర్‌రావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.1 /26.1

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వేడి, ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

లోపం.. అధిగమించేలా



పెంచికల్‌పేట్‌లో ప్రశస్త్ యాప్‌పై టీచర్లకు అవగాహన కల్పిస్తున్న శిక్షకురాలు

- విద్యార్థుల్లో శారీరక, మానసిక వైకల్యాల గుర్తింపునకు ప్రశస్త్ యాప్
- రెండు దశల్లో వివరాలు నమోదు
- అభ్యసన లోపాల గుర్తింపే లక్ష్యంగా కార్యక్రమం
- ప్రభుత్వ పాఠశాలల్లో 67,846 మంది విద్యార్థులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): విద్యార్థుల్లో శారీరక, మానసిక వైకల్యాలు గుర్తించి, వారికి అవసరమైన చేయూతను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రశస్త్ యాప్ రూపొందించింది. తరగతి గదుల్లో విద్యార్థుల్లో ఉన్న శారీరక, మానసిక, అభ్యసన వైకల్యాలను ఉపాధ్యాయులు గుర్తించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. యాప్‌లో నమోదు చేయాల్సిన అంశాలపై మండలస్థాయిలో ఇప్పటికే ఉన్నతాధికారులు రిసోర్స్‌పర్సన్ల ద్వారా ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ అందించారు. యాప్‌లో రెండు దశల్లో విద్యార్థుల వివరాలు నమోదు చేసేందుకు వీలుగా యాప్ రూపొందించారు.

జిల్లాలో ఇలా..


కుమురంభీం జిల్లాలోని 15 మండలాల్లో మొత్తం ప్రాథమిక పాఠశాలలు 896, ప్రాథమికోన్నత పాఠశాలలు 108, ఉన్నత పాఠశాలలు 105 ఉన్నాయి. అయా స్కూళ్లలో 67,846 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది విద్యార్థులు శారీరక, మానసిక వైకల్యాలతో చదువులో మిగితా వారితో పోలిస్తే వెనుకబడుతున్నారు. నిరక్షరాసులైన తల్లిదండ్రులకు అవగాహన లేకపోతే చిన్నారుల్లోని వైకల్యం వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఆరోగ్య సమస్యలు బాల్యంలోనే నిర్ధారిస్తే చికిత్స ద్వారా పరిష్కరించవచ్చు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థుల్లో శారీరక, మానసిక వైకల్యాలు, ఇతర ఆరోగ్య సమస్యలు సులువుగా గుర్తించి నమోదు చేయడమే లక్ష్యంగా ప్రశస్త్ యాప్‌లో చెక్‌లిస్టు పొందుపరిచారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు నమోదు చేసిన వివరాల ద్వారా సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించనున్నారు. అవసరమైన వారికి భవిత కేంద్రాల ద్వారా విద్య అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు 40శాతం వైకల్యం ఉంటే ప్రభుత్వమే సదరం కేంద్రాల ద్వారా సర్టిఫికెట్లు సైతం మంజూరు చేస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రత్యేక కేంద్రాల్లో శారీరక, మానసిక వైకల్యాలకు అనుగుణంగా శిక్షణ అందించనున్నారు.

రెండు దశల్లో నమోదు..

ప్రశస్త్ యాప్‌లో మొదటి భాగంలో ప్రాథమిక వివరాలపాటు 17 అంశాలకు సంబంధించిన వైకల్య వివరాలను నమోదు చేయనున్నారు. మొదటి భాగంలో విద్యార్థి పేరు, తరగతి, వయస్సు, లింగం, పెన్ నంబరు, తల్లిదండ్రుల పేరు, విద్యార్థి ఎత్తు, బరువులను మొదటి భాగంలో చేర్చారు. యాప్ రెండో భాగంలో విద్యార్థులకు సంబంధించిన లోకో మోటార్ వైకల్యం, లెప్రసీ, సెరిబ్రల్ పాల్సీ, డార్ఫిజం, మస్క్యులర్ డిస్ట్రోఫీ, యాసిడ్ దాడి బాధితులు, అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడి లోపం, ప్రసంగం, భాషా పరమైన ఇబ్బందులు, మేధో వైకల్యం, నిర్దిష్ట అభ్యసన వైకల్యాలు, ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్, మానసిక అనారోగ్యం, మల్టీపుల్ స్కెలోరోసిస్, పార్కిన్సన్ వ్యాధి, హీమోఫీలియా, తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధి, బహుళ వైకల్యాలకు సంబంధించిన వివరాలు స్పష్టంగా నమోదు చేయనున్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

ప్రతీ పాఠశాలలోని విద్యార్థుల వివరాలను యాప్‌లో నమోదు చేయడానికి అధికారులు నిర్దిష్ట గడువు విధించారు. మొదటి భాగంలో విద్యార్థుల ప్రాథమిక సమాచారాన్ని నమోదును సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 20 వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే రెండో దశలో విద్యార్థుల వైకల్యాలను గుర్తించడానికి అక్టోబర్ 27 నుంచి నవంబర్ 14 వరకు అధికారులు గడువునిచ్చారు. తరగతి గదిలో విద్యార్థుల ప్రవర్తనను గమనించి ఉపాధ్యాయులు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతీ విద్యార్థి వివరాలను నమోదు చేయడానికి ఇప్పటికే ప్రత్యేకంగా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రశస్త్ యాప్

ప్రక్రియ ప్రారంభమైంది

ప్రశస్త్ ప్రత్యేక యాప్‌కు సంబంధించి ఉపాధ్యాయులకు మండలస్థాయిలో శిక్షణ అందించాం. పాఠశాలలోని ప్రతీ విద్యార్థి ప్రాథమిక సమాచారాన్ని యాప్‌లో పొందుపరుస్తున్నారు. నెల రోజులపాటు ప్రాథమిక సమాచారంలోని అంశాలను తరగతి గదిలో పరిశీలిస్తూ చెక్‌లిస్టు ద్వారా పూర్తి చేస్తారు. రెండో భాగంలో విద్యార్థులకు సంబంధించిన వివరాలను అక్టోబర్ చివరి వారం నుంచి నవంబర్ లోగా పూర్తి చేస్తాం.

– కటకం మధుకర్, సెక్టోరియల్ అధికారి

‘ఆమె’కే కోత



- కు.ని. ఆపరేషన్‌కు ముందుకు రాని పురుషులు
- క్షేత్రస్థాయిలో అవగాహన లోపం
- ట్యూబెక్టమీతో మహిళల్లో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం

తిర్యాణి(ఆసిఫాబాద్): మహిళలు మాతృత్వం కోసం ఎన్నో కలలు కంటుంటారు. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల ధన దాహంతో సిజేరియన్ కోతలు పెరిగాయి. మరోవైపు కుటుంబ నియంత్రణ పేరిట వారికే మరో కోత తప్పడం లేదు. అవగాహన లేక పురుషులు కుటుంబ నియంత్రణ(కు.ని.) ఆపరేషన్లకు ముందుకు రావడం లేదు. పురుషులకు నిర్వహించే వెసెక్టమీ శస్త్రచికిత్సలో జిల్లాలో అత్యల్పంగా నమోదవుతుండగా.. అదే సమయంలో మహిళలకు ట్యూబెక్టమీ ఆపరేషన్లు అధికంగా నమోదవుతున్నాయి. అన్ని రంగాల్లో వెనుకబడిన గిరిజన జిల్లా కుమురంభీం ఆసిఫాబాద్‌లో చాలా ప్రాంతాల్లో సంప్రదాయాలు పాటిస్తుంటారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు అంటే కేవలం మహిళలు మాత్రమే చేయించుకునే సర్జరీ అనే భావన పాతుకుపోయింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 413 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగినట్లు వైద్యారోగ్య శాఖ వివరాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో 411 ట్యూబెక్టమీ శస్త్ర చికిత్సలు ఉండగా.. కేవలం రెండు మాత్రమే వెసెక్టమీ ఆపరేషన్లు ఉండటం జిల్లాలో పరిస్థితికి అద్దం పడుతోంది.

అవగాహన ఏదీ..

జనాభా విస్ఫోటనాన్ని అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై దృష్టి సారించాయి. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ శస్త్ర చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లలో వెసెక్టమీ, ట్యూబెక్టమీ అని రెండు రకాలుగా ఉంటాయి. పురుషులకు చేసే ఆపరేషన్‌ను వెసెక్టమీ అని, మహిళలకు చేసే వాటిని ట్యూబెక్టమీ అని పిలుస్తారు. కొంతమంది మహిళల్లో రెండు, మూడు కాన్పులు వరుసగా సిజేరియన్లు అయిన తర్వాత కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకుంటారు. ట్యూబెక్టమీ ద్వారా పొట్టపై నాలుగైదు అంగుళాల మేర కోస్తుంటారు. చాలామంది మహిళలు ప్రసవ సమయంలోనే ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. దీని ద్వారా వారికి భవిష్యత్తులో అనార్యోగ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఆశ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లుకు టుంబ నియంత్రణ ఆపరేషన్లపై అవగాహన కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. వెసెక్టమీ ఆపరేషన్ చేయించుకోవడం ద్వారా శారీరకంగా బలహీనమవుతామనే అపోహ పురుషుల్లో ఉంది.

కు.ని. ఆపరేషన్ల వివరాలు

సంవత్సరం	ట్యూబెక్టమీ (మహిళలు)	వెసెక్టమీ (పురుషులు)
2021- 22	1,730	36
2022- 23	1,106	16
2023- 24	1,083	06
2024	411	02 (ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు)

అనవసర అపోహలు

మహిళలకంటే పురుషులకే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు సులువుగా చేసేందుకు ఆస్కారం ఉంటుంది. పురుషులకు కూడా గతంలో కోత విధానం ఉండేది. ప్రస్తుతం సాధారణ ఇంజెక్షన్ వేసుకున్న తరహాలో ఆపరేషన్ వేగంగా చేస్తున్నారు. ఐదు నిమిషాల వ్యవధిలోనే సర్జరీ పూర్తవుతుందని వైద్యులు చెబుతున్నారు. ఆపరేషన్ జరిగిన తర్వాత కొద్దిసేపు ఆస్పత్రిలో సిబ్బంది పర్యవేక్షణలో ఉంచుకుని గంటలోపే డిశ్చార్జి చేస్తున్నారు. గాయం మానితే మూడు నెలల తర్వాత అన్ని పనులూ సక్రమంగా చేసుకోవచ్చు. భవిష్యత్తులో గాయం, ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు కూడా తలెత్తవు. అయినా అనవసర అపోహలు, అవగాహన లేకపోవడంతో జిల్లాలోని మారుమూల గ్రామాల్లో పురుషులు కు.ని. ఆపరేషన్లకు ముందుకు రావడం లేదు. ఏజెన్సీ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తే వెసెక్టమీ ఆపరేషన్లు పెరిగే అవకాశం ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పురుషులు చేయించుకోవడమే మేలు. ట్యూబెక్టమీ సర్జరీలతో మహిళల్లో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. వెసెక్టమీ ఆపరేషన్లు పెంచేందుకు వైద్యసిబ్బందితో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తాం.

– డాక్టర్ సిద్దార్థ, కుటుంబ నియంత్రణ ప్రాజెక్టు అధికారి

న్యూస్‌రీల్

సీఆర్‌టీల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: సీఆర్‌టీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆశ్రమ పాఠశాలల సీఆర్‌టీలకు సభ్యత్వ నమోదు చేయించారు. ఆయన మాట్లాడుతూ గత జూన్ నుంచి సీఆర్‌టీలకు వేతనాలు లేకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. మినిమం టైం స్కేల్ అమలు చేస్తూ వారికి సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మారుతి, నాయకులు శంకర్, శ్రీనివాస్, విజేష్, ప్రవీణ్, చేతన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘ఏచూరి’ ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ జాతీయ అధ్యక్షుడు సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయడమే.. ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని సంస్మరణ సభ నిర్వహణ కమిటీ నాయకులు అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన సంస్మరణ సభలో పలువురు వక్తలు మాట్లాడారు. విద్యార్థి సంఘంలో పనిచేస్తున్న సమయంలో సీతారాం ఏచూరి అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశారన్నారు. దేశంలో అణగారిన వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, సామాజిక తరగతుల హక్కులపై అలుపెరగని ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సాయికృష్ణ, వివిధ సంఘాల నాయకులు మేడి చరణ్‌దాస్, శాంతికుమారి, మధుకర్, కేశవ్, శ్యాంసుందర్, ఖమర్, రాజకమలాకర్ రెడ్డి, మహిపాల్, రమేశ్, విస్తారు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే జ్ఞానం, సంస్కారం



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యతో జ్ఞానం పెరగడంతోపాటు సంస్కారం అలవడుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేశవరావు మాట్లాడుతూ కవి జాషువా దళిత సమాజంలో మార్పు కోసం గబ్బిలం అనే కావ్యాన్ని రచించారని తెలిపారు. సమాజంలో కుల వివక్షత రూపుమాపేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆకసం అధ్యక్షుడు నల్లగొండ రమేష్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, నారాయణ మూర్తి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వాంకిడి(ఆసిఫాబాద్): మండలంలోని సవాతి, ధాబా గ్రామ పంచాయతీలకు తాగు నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టినట్లు అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వరద ఉధృతికి పైప్‌లైన్ దెబ్బతిని ఆవైపు గ్రామాలకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగింది. సంబంధిత శాఖల అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ దెబ్బతిన్న పైప్‌లైన్‌ను పరిశీలించారు. ఆదివారం సిబ్బంది పైప్‌లైన్‌కు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారని అదనపు కలెక్టర్ వెల్లడించారు.

పర్యవేక్షణ పెరిగేనా..!

- 12 మంది ఇన్‌చార్జి ఎంఈవోలను నియమించిన విద్యాశాఖ
- పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరుపై పర్యవేక్షణ
- ఈ సారైనా ‘పది’లో ఉత్తీర్ణత మెరుగుపడేనా..?



జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో కొన్నేళ్లుగా పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు నిరాశజనకంగా ఉంటున్నాయి. ఉపాధ్యాయులు స్థానికంగా ఉండకపోవడం, పాఠశాలల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో గ్రామీణ విద్యార్థులు పాఠ్యాంశాలపై పట్టు సాధించేందుకు ఇబ్బంది పడేవారు. ఈ క్రమంలో నూతన ప్రభుత్వం జిల్లాలో 12 మంది ఇన్‌చార్జి విద్యాధికారులను నియమించింది. పాఠశాలలపై పర్యవేక్షణ పెరిగితే ‘పది’ ఉత్తీర్ణత పెరిగే అవకాశం ఉంది.

12 మంది ఇన్‌చార్జి ఎంఈవోలు

జిల్లావ్యాప్తంగా లోకల్‌బాడీ కింద 704 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 2024- 25 విద్యా సంవత్సరంలో 37,948 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో జిల్లాలోని కౌటాల మండలానికి మాత్రమే రెగ్యులర్ ఎంఈవో ఉండేవారు. ఇన్‌చార్జీలతో కలిసి కేవలం నలుగురు విద్యాధికారులు మాత్రమే నాలుగైదు మండలాల బాధ్యతలు నిర్వర్తించేవారు. పర్యవేక్షణ లేక విద్య వ్యవస్థ కుంటుపడిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రభుత్వం విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉన్నత పాఠశాలల్లోని 12 మంది సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించారు. ఆసిఫాబాద్ మండలానికి ఉదయ్‌బాబును ఎంఈవోగా నియమించగా.. కాగజ్‌నగర్‌కు ప్రభాకర్, రెబ్బెన వెంకటేశ్వర్, వాంకిడి శివ చరణ్‌కుమార్, బెజ్జూర్ సునీత, సిర్పూర్(యూ) సుధాకర్, దహెగాం శ్రీనివాస్, తిర్యాణి అంజయ్య, పెంచికల్‌పేట్ రమేశ్‌బాబు, లింగాపూర్ శ్రీనివాసరావు, సిర్పూర్(టి) వేణుగోపాల్‌రావు, కౌటాల మండలానికి హనుమంతు విద్యాధికారిగా నియమితులయ్యారు.

సమయానికి వస్తారా..?

ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు కొందరు స్కూళ్లకు సక్రమంగా హాజరు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు సమయపాలన పాటించకుండా నచ్చిన సమయానికి వస్తారనే అపవాదు సైతం ఉంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లకుండా డుమ్మా కొడుతున్నారు. ఇలాంటి ఆరోపణల నేపథ్యంలోనే గత ప్రభుత్వం 2023 జూన్‌లో అన్ని స్కూల్‌లో బయోమెట్రిక్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం రెండుసార్లు బయోమెట్రిక్ హాజరు వేసేవాళ్లు. 2022- 23 విద్యా సంవత్సరం తర్వాత ఈ విధానం తొలగించారు. నూతనంగా ఎంఈవోలను నియమించిన నేపథ్యంలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

‘పది’లో అట్టడుగు

పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు మూడేళ్లుగా ఆశించిన ఫలితాలు రావడం లేదు. 2021- 22 విద్యా సంవత్సరంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా 79 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 32వ స్థానంలో, 2022- 23లో 75 ఉత్తీర్ణతతో 30వ స్థానం నిలిచింది. అలాగే 2023- 24 విద్యా సంవత్సరంలో మొత్తం 6,393 మంది పరీక్షలకు హాజరైతే 5,325 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో 31వ స్థానంలో జిల్లా నిలిచింది. పర్యవేక్షణ లేకపోవడంతోనే విద్యావ్యవస్థ గాడితప్పిందనే విమర్శలు వచ్చాయి. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతులతో జిల్లాలో ఎస్జీటీలు నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు పొందారు. ఫలితంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తయితే 319 పోస్టులు భర్తీ కానున్నాయి. విద్యావ్యవస్థ అనుకున్న స్థాయిలో లేకపోవడంతోనే ఉన్నతాధికారుల ఒత్తిడితోనే గతంలో పనిచేసిన డీఈవో అశోక్ దీర్ఘకాలిక సెలవుల్లోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతానికి మంచిర్యాల డీఈవో యాదయ్యకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు విద్యాధికారిగా బాధ్యతలు అప్పగించారు. అయితే రెండు జిల్లాల పర్యవేక్షణ కష్టమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెగ్యులర్ అధికారిని నియమిస్తేనే బోధన సక్రమంగా సాగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పర్యవేక్షణ పెంచుతాం



విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా అన్ని మండలాలకు ఎంఈవోలను నియమించాం. పాఠశాలలపై పర్యవేక్షణ పెంచడంతోపాటు ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు అందిస్తాం. పదో తరగతి వార్షిక ఫలితాల్లో ఉత్తీర్ణత పెంచేందుకు కృషి చేస్తాం.

– యాదయ్య, డీఈవో

బాధిత విద్యార్థినికి కార్పొరేట్ విద్యనందించాలి

ఆసిఫాబాద్‌రూరల్: అత్యాచారానికి గురైన ఆసిఫాబాద్ మండలానికి చెందిన విద్యార్థినికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కార్పొరేట్ విద్యనందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితురాలు మైనర్ అయినందున ప్రభుత్వం పూర్తిబాధ్యత తీసుకుని కుటుంబానికి రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసుశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు లేకుండా కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీటీసీ గోపాల్, వినోద్ తదితరులు ఉన్నారు.



క్లుప్తంగా

మద్యం మత్తులో ఆత్మహత్య

భైంసారూరల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పాంగ్రి గ్రామానికి చెందిన రాంకూరే గణేశ్ (26) గత రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజు మద్యం తాగి కుటుంబీకులతో గొడవపడేవాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికివచ్చి కుటుంబీకులతో గొడవపడి చచ్చిపోతా అంటూ వెళ్లిపోయాడు. అతని కోసం వెళ్లగా గ్రామశివారులో చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. గణేశ్‌ను వెంటనే భైంసా ఏరియాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. భార్య గంగాసాగర ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరేసుకుని ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడకు చెందిన లింగాల కిరణ్ కుమార్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిలాబాద్‌రూరల్ ఏఎస్సై మారుతి కథనం ప్రకారం.. కిరణ్‌కుమార్ (35) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత కొన్నినెలలుగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో భార్యతో గొడవపడేవాడు. నెల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపంతో శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం తండ్రి శ్రీనివాస్ గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. భార్య శిరీష ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఎలుగుబంటి దాడిలో మేకల కాపరికి గాయాలు

తిర్యాణి:మండలంలోని బోడగూడలో ఎలుగుబంటి దాడిలో మేకల కాపరికి తీవ్ర గాయాలయ్యాయి. గోపెర ఫారెస్టు సెక్షన్ అధికారి మల్లయ్య కథనం ప్రకారం.. గిన్నెదరి రేంజ్ పరిధిలోని గోపెర సెక్షన్‌కు, కైరిగూడ బీట్ పరిధిలోని బోడగూడ అటవీప్రాంతంలో అదే గ్రామానికి మేకల కాపరి పంద్రం బగ్గు తన మేకలను మేపి శనివారం సాయంత్రం ఇంటికి వస్తుండగా పిల్లలతో కూడిన ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేసింది. ఈ దాడిలో బగ్గు కాలికి తీవ్రగాయమైంది. స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితుడికి నష్టపరిహారం అందేలా చూస్తామని పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి ప్రధాన రహదారిలో అక్రమంగా తరలిస్తున్న పశువులను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కౌటాల మండల కేంద్రంతోపాటు బెజ్జూర్ మండలంలోని సలుగుపల్లి, మర్థిడి గ్రామాల నుంచి అనుమతి లేకుండా నాలుగు వాహనాల్లో 36 పశువుల ను తరలిస్తున్నారు. పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించారు. వాహనాలను సీజ్‌చేసి చేసి, పశువులను అక్రమంగా తరలిస్తున్న జగిత్యాల జిల్లాలోని చిన్నకోడూరు, గొల్లపల్లి గ్రామాలకు చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ, Sal:20k-30k మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 9030612463 [G-9049]

■ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీ వసతి + భోజనం. జీతం: 17K. ఫోన్: 8520874499, 8520980099 [H-796282]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

దసరాకు ఆర్టీసీ సిద్ధం

- అక్టోబర్ 1 నుంచి 11 వరకు ప్రత్యేక బస్సులు
- ప్రయాణికుల రద్దీకనుగుణంగా ఏర్పాట్లు
- ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 412 సర్వీసులు


ఆదివారం మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

మంచిర్యాలఅర్బన్: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అక్టోబర్ 1 నుంచి 11వ తేదీ వరకు నడిపేందుకు సన్నద్ధమవుతుంది. ఆయా ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. స్కూల్, కళాశాలలకు పండుగ సెలవులు ఉన్నందున ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇంకోవైపు ట్రాక్ మరమ్మతు నేపథ్యంలో రైళ్ల బంద్‌తో బస్సులను ఆశ్రయించే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఆదిలాబాద్ రీజియన్‌లో ఆయా డిపోల నుంచి 412 బస్సులను జేబీఎస్ (హైదరాబాద్ నుంచి) ప్రత్యేకంగా నడపడానికి సన్నాహాలు చేస్తోంది.

మంచిర్యాల నుంచి ఎక్కువ బస్సులు..

పండుగ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల నుంచి ఎక్కువగా బస్సులు నడపనున్నారు. రీజియన్ వారీగా 412 బస్సులు నడపనుండగా మంచిర్యాల నుంచి 125 బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. నిర్మల్ నుంచి 120, ఆదిలాబాద్ 78, ఆసిఫాబాద్ 73, భైంసా 11, ఉట్నూర్ 05 బస్సులు నడపనున్నారు. హైదరాబాద్‌లో ఉద్యోగ, వ్యాపార, చదువుల నిమిత్తం వెళ్లినవారు స్వగ్రామాలకు పయనం కానున్నారు. పండుగ వేళ ట్రాక్ మరమ్మతు పేరిట కాగజ్‌నగర్, పుష్పుల్, రామగిరి, ఇంటర్‌సిటీ రైళ్లు రద్దు చేశారు. గోరఖ్‌పూర్–కొచ్చువెల్లి, ఎర్నాకులం, శ్రీవైష్ణోదేవి–చెన్నై, కాజీపేట్–పుణె పలు వీక్లీరైళ్లు రద్దు, దారి మళ్లింపు చేశారు. ఇంకోవైపు మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళల రద్దీ పెరిగింది. ఈనేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు టికెట్లు రిజర్వేషన్లు చేసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో నడిచే బస్సుల కంటే ప్రత్యేక బస్సులు నడిపి ఆదాయం సమకూర్చేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. జేబీఎస్‌లో ప్రయాణికుల సమాచారం కోసం ఆయా డిపోల నుంచి ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

గతేడాదికంటే ఎక్కువ..

ఆర్టీసీ గతేడాది కంటే ఈ ఏడాది పండుగకు అదనంగా బస్సులు నడపనుంది. గతేడాది సెప్టెంబర్ 13 నుంచి 22 వరకు 404 బస్సులు నడపగా, ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి 11 వరకు 412 బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయనున్నారు. గతేడాది మంచిర్యాల నుంచి 116, నిర్మల్ నుంచి 108 ఆదిలాబాద్ నుంచి 87 బస్సులు నడపగా ఈ ఏడాది కాస్త బస్సుల సంఖ్య పెంచారు.

డిపోల వారీగా..అక్టోబర్ 1నుంచి 11 తేదీ వరకు

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఉట్నూర్	మంచిర్యాల	ఆసిఫాబాద్
1	6	1	12	0	15	6
2	2	0	5	0	4	3
3	3	0	5	0	5	3
4	2	0	5	0	4	3
5	12	2	16	1	18	11
6	5	1	8	1	6	6
7	4	0	5	0	7	3
8	3	0	5	0	4	3
9	12	2	16	1	18	11
10	13	2	18	1	20	11
11	16	3	23	1	24	13

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా..



దసరా పండుగ వేళ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్సులు నడపనుంది. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ బస్సులు నడపనున్నాం. ప్రయాణికులకు ఇక్కట్లు లేకుండా ఆయా బస్‌స్టేషన్ల వద్ద సమాచారం అందించేందుకు ప్రత్యేక సిబ్బంది నియమించాం. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్టీసీ బస్సుల్లో క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

– సోలోమాన్, ఆర్టీసీ రీజియనల్ మేనేజర్, ఆదిలాబాద్

ఆర్కే 5 గనిపై చోరీ

- ట్రంక్‌పెట్టెల్లో ఫోన్లు, నగదు అపహరణ


పగులగొట్టి ఉన్న ట్రంక్ పెట్టెలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనిపై శనివారం రాత్రి చోరీ జరిగింది. గనిపై కార్మికులు తమ సామగ్రిని భద్రపర్చుకునే ట్రంక్ పెట్టెలను పగులగొట్టి దొరికినకాడికి దొంగలు దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం డ్యూటీ ముగించుకుని కార్మికులు వచ్చేసరికి తాళాలు పగులగొట్టి తెరిచి ఉన్నాయి. రూ.3 లక్షల విలువ చేసే సెల్ ఫోన్లు, రూ.10 వేల నగదు, కొన్ని బైక్ కీలు చోరీకి గురయ్యాయని బాధితులు గని అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఎస్అండ్‌పీసీ అధికారుల నిర్లక్ష్యంతోనే: ఏఐటీయూసీ

ఎస్అండ్‌పీసీ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ చోరీలు పునరావృతం అవుతున్నాయని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని డెప్యూటీప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచి సెక్రెటరీ షేక్ బాజీసైదా సందర్శించారు. కార్మికులకు పటిష్టమైన లాకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఫిట్ సెక్రెటరీగునిగంటి నర్సింగరావు, నాయకులు అఫ్రోజ్ ఖాన్,నాగుల రాజయ్య, సతీశ్, రమేశ్ ఉన్నారు.

పటిష్ట చర్యలు చేపట్టాలి: టీబీజీకేఎస్

గనులపై రక్షణ చర్యలు పటిష్టంగా చేపట్టాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సంఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కార్మికులతో మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. డెప్యూటీ జనరల్ సెక్రెటరీ బండి రమేశ్, నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి, దుర్గం రవి, ముస్త్యాల రమేశ్, గొర్ల సంతోశ్, గోపి నాయక్, ఎండీ లాల ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



కాసిపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో జరిగిన అపూర్వ సమ్మేళనానికి వారు హాజరయ్యారు. 25 ఏళ్ల తర్వాత ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ సీబీడీ అడిషనల్ ఎస్పీ రవికుమార్ హాజరై మాట్లాడారు. మానవీయ సంబంధాలు మెరుగుపడాలంటే ఇలాంటి సమ్మేళనాలు ఎంతో అవసరమన్నారు. – కాసిపేట

రాంనరేశ్‌కు గవర్నర్ ప్రశంస

- జిల్లా ఉపాధ్యాయుడికి అభినందన లేఖ



పద్య శతక గ్రంథం ముఖచిత్రం ఇదే

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా సాహితీ ఖిల్లాగా పేరుగాంచింది. తాజాగా జిల్లాకు చెందిన కవి, రచయిత, సాహితీవేత్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వకుళాభరణం రాంనరేశ్ కుమార్ సాహితీకళకు గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ ప్రశంస దక్కింది. భైంసా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఈయన 'వినరా భారతీయ వీరచరిత్ర..పేరిట దేశ చారిత్రక వీరుల కథాంశాలను శతక పద్య రూపక పుస్తకంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఇది ప్రచురణ దశలో ఉంది. త్వరలో విడుదల కానున్న పుస్తకాన్ని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, గవర్నర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పుస్తకాన్ని ఆయన చదివి ప్రశంసించారు. సాహితీ నైపుణ్యం, జాతీయవాద చరిత్రపై రాంనరేశ్‌కు ఉన్న మక్కువపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రెండురోజుల క్రితం అభినందన లేఖను పంపారు. రాంనరేశ్ గతంలో అనేక కథాంశాలతో పలు కవితలను రచించారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్టు

- నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం
- కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు


నిందితుడు, స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ

ఆదిలాబాద్‌టౌన్: జల్సాలకు అలవాటుపడి బైక్‌లు చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను టూటౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు కథనం ప్రకారం..ఈనెల 22న రాత్రి సమయంలో ఖుర్షీద్‌నగర్ కాలనీలోని అరార పెట్రోల్‌బంక్ నుంచి తన బైక్ చోరీకి గురైనట్లు తిర్పెల్లికి చెందిన బాధితుడు షేక్ అజీమ్ అహ్మద్ ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేశారు. ఎస్సై విష్ణుప్రకాశ్, కానిస్టేబుళ్లు నరేశ్, నరేందర్, సుధాకర్‌రెడ్డి, సంజీవ్, రమేశ్, గోపాల్, హెడ్‌కానిస్టేబుల్ మదన్, రమణయ్య ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట వాహనాలు తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి బైక్ అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించారు. నేరడిగొండ మండలం బుగ్గారం తండాకు చెందిన బుక్య కృష్ణరాథోడ్ దొంగతనానికి పాల్పడినట్లు తెలిపాడు. ఆదిలాబాద్‌లో 2, నిర్మల్‌లో 1, భైంసాలో 1 బైక్‌లు దొంగతనం చేసినట్లు పేర్కొన్నారు. ఇదివరకు కరీంనగర్‌లో 3, నిజామాబాద్‌లో 1, మెదక్ జిల్లా రామాయంపేటలో 1, కామారెడ్డిలో 1, నిర్మల్ జిల్లా కడెం, భైంసా, నిర్మల్‌లో ఒక్కొక్కటి చొప్పున బైక్‌లు చోరీ చేసినట్లు తెలిపారు. బైక్‌ల దొంగతనం కేసులో ఇప్పటికే మూడుసార్లు జైలుకు వెళ్లినట్లు వివరించారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర జట్టుకు తృతీయ బహుమతి


తృతీయ బహుమతి అందుకుంటున్న రాష్ట్ర జట్టు

రెబ్బెన(ఆసిఫాబాద్): హర్యానా రాష్ట్రంలోని రోతక్ జిల్లాలో జరిగిన 43వ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తృతీయస్థానంలో నిలిచినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాకు చెందిన దామర ప్రేమ్‌దీప్ రాష్ట్రజట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించటంతోపాటు పోటీల్లో అద్భుత ఆటతీరును ప్రదర్శించి జట్టు గెలుపు కోసం కృషి చేసినందుకుగాను బెస్ట్ టాప్ ఫైవ్ ప్లేయర్‌లో బెస్ట్ అవార్డును సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రేమ్‌దీప్..2023లో కర్ణాటకలో జరిగిన సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాడు. బెస్ట్ ప్లేయర్ అవార్డు పొందిన సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రేమ్‌దీప్‌ను అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏరియా జీఎం శ్రీనివాస్, సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ తిరుపతి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సింగం అభినందించారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత


తల్లికి చిన్నారిని అప్పగిస్తున్న ఎస్సై రాజశేఖర్

మందమర్రిరూరల్: తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని శ్రీపతినగర్‌కు చెందిన చిన్నారి సన్‌ఫిర్జోశ్(5) ఆదివారం ఉదయం కిరాణం దుకాణానికి వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు 100 డయల్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఎస్సై ఆధ్వర్యంలో ఆరు పోలీసు బృందాలు గాలింపుచర్యలు చేపట్టారు. దీపక్‌నగర్ ఏరియాలో చిన్నారి సుమారు మూడున్నర గంటల తర్వాత కనిపించింది. ఎస్సై రాజశేఖర్ ఆ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

పత్తికి సూక్ష్మపోషకాలు తప్పనిసరి

- మొక్కల ఎదుగుదలకు కాంప్లెక్స్ ఎరువులు వాడాలి
- జింక్, బోరాన్, మెగ్నీషియం అవసరం


పత్తిలో జింక్ లోపంతో రంగు మారిన ఆకులు


బోరాన్ లోపంతో ఎర్రబారిన పత్తి

చెన్నూర్‌రూరల్: పత్తి పంటకు అందించే ప్రధాన మూలకాలు లేదా పోషకాలు నత్రజని (యూరియా, డీఏపీ, కాంప్లెక్స్), పాస్పరస్(పి) సింగిల్ పాస్ఫేట్, పొటాష్ (మ్యూరేట్‌ఆఫ్ పొటాష్, మల్టికె కాంప్లెక్స్ అందిస్తారు. వీటితోపాటు మొక్కల ఎదుగుదల, కాయల అభివృద్ధి, పత్తి నాణ్యత, దిగుబడి పెరగడానికి జింక్, బోరాన్, మెగ్నీషియం తదితర సూక్ష్మపోషకాలు అందించడం తప్పనిసరని చెన్నూర్ ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్ సూచించారు.

జింక్: జింక్ లోపంతో విత్తనాలు విత్తిన మూడు వారాల తర్వాత మొక్క మధ్య ఆకులపై కనిపిస్తుంది. ఆకుల ఈనెలు, ఆకుపచ్చగా ఉండి ఈనెల మధ్య భాగం పసుపు పచ్చగా మారుతుంది. గోధుమరంగు మచ్చలు ఆకుల చివర్ల నుంచి మొదలుకు వ్యాపిస్తాయి. ఆకుచివర్లు ఎండిపోతాయి. కొమ్మ చివరి ఆకులు చిన్నవిగా ఉండి ముడతలు పడి కణుపుల మధ్య దూరం తగ్గిపోతుంది. మొక్కలు చిన్నవిగా గుబురుగా కనిపిస్తాయి.

నివారణ చర్యలు: జింక్ లోపం ఉండకుండా ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్‌సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్‌లోపం కనిపించగానే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి ఐదు రోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారి చేయాలి.

బోరాన్: మొక్క జీవనక్రియలో బోరాన్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. మొక్కలో సున్నం, పొటాష్ పోషకాలను క్రమబద్ధీకరిస్తుంది. మొక్క సున్నాన్ని సక్రమంగా వినియోగించుకోవడానికి బోరాన్ అవసరం ఉంటుంది. సున్నంపాటు ఎక్కువగా ఉన్న నేలల్లో వర్షాభావ పరిస్థితుల్లో అధిక వర్షపాతం ఉన్నప్పుడు ఈ లోపం కనిపిస్తుంది. ఆకులు, కాడలు ఒకే రీతిలో ఊడక కొంత దళసరిగాను, కొంత పలుచగాను ఉండి అక్కడక్కడ గుండ్రటి మచ్చలు ఏర్పడుతాయి. పూత, మొగ్గ దశలో ఎండిపోవడం, చిన్నకాయలు రాలిపోవడం మొక్కలు గిడసబారి మొదలుపై పగుళ్లు ఏర్పడుతాయి. కాండం సరిగా అభివృద్ధి చెందక ఆకారం కోల్పోయి, పగుళ్లు ఏర్పడుతాయి.

నివారణ చర్యలు: బోరాన్ లోపించకుండా ఉండేందుకు ఎకరాకు 4 కిలోల బోరాక్స్ దుక్కిలో వేయాలి. బోరాన్ లోపం మొక్కలపై కనిపిస్తే పైరు విత్తిన 60, 90 రోజుల తర్వాత లీటరు నీటికి 1.5 గ్రాముల బోరాక్స్ వారం వ్యవధిలో మూడుసార్లు పిచికారి చేయాలి.

మెగ్నీషియం: ఈ దాతువు లోపం ఎక్కువగా సున్నపు నేలల్లో, పొటాష్ ఎక్కువగా ఉన్న నేలల్లో పండించే పంటలో కనిపిస్తుంది. మెగ్నీషియం లోపం పత్తిలో ఎక్కువగా ఉంటుంది. మెగ్నీషియం లోపం ఉన్నప్పుడు ముదురు ఆకులు అంచుల నుంచి మధ్య భాగానికి పసుపు రంగులోకి మారుతాయి. ఆకుల ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలిపోతాయి.

నివారణ చర్యలు: మెగ్నీషియం లోపిస్తే లీటరు నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి 45, 75 రోజులకోసారి పిచికారి చేయాలి. ప్రధాన పోషకాలు నత్రజని, పాస్పరస్, పొటాష్‌లు రైతులు ఏదో ఒక రూపంలో అందించాలి. దాని కంటే అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. సూక్ష్మ పోషకాల ఆవశ్యకత తెలియక రైతులు పురుగుమందులు వాడుతున్నారు. రైతులు వారి స్థాయిలో లోపాల లక్షణాలు గుర్తించి అన్ని ఎరువులు సమపాళ్లో వాడితే పెట్టుబడి తగ్గి దిగుబడిని పెంచుకోవచ్చు.

శరన్నవరాత్రుల్లో పలు సేవలు రద్దు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శ్రీ శారదీయ శరన్నవరాత్రుల సందర్భంగా పలు సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 11 వరకు అభిషేకం, 9న అక్షరాభ్యాసములు తప్ప మిగతా అర్జిత సేవలు, వీఐపీ పాసులు, 11 నుంచి 13 వరకు చండీహోమం, 12న పూర్ణ హారతి, తదుపరి అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. భక్తులు సహకరించగలరని వారు కోరారు.

రేకుల షెడ్లు కూల్చివేత


షెడ్లను కూల్చివేసిన దృశ్యం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని చున్నంబట్టివాడలో గల ఉమర్‌మియా సొసైటీలో నిర్మించిన ఐదు రేకులషెడ్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. సొసైటీకి సంబంధించిన భూవివాదాల కారణంగా రెండు వర్గాలకు చెందిన వారు కోర్టుకు వెళ్లారు. ఈక్రమంలో రేకుల షెడ్లను కూల్చివేసిన సంఘటన కలకలం రేపింది. రాత్రి వేళ కూల్చివేతల వెనుక రెండు వర్గాల్లో ఎవరైనా ఉన్నారా, లేక ఇతరుల ప్రమేయం ఉందా లేదాని తెలియాల్సి ఉంది. కూల్చివేతలకు సంబంధించిన సమాచారం తెలియదని అధికారులు చెబుతున్నారు.

కొనసాగుతున్న ఎల్లంపల్లి గేట్ల ఎత్తివేత


ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి నీటిని విడుదల

మంచిర్యాలరూరల్(హాజీపూర్) మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లఎత్తివేత కొనసాగుతోంది. 20 గేట్లను ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు 147.95 మీటర్ల నీటి మట్టం ఉండగా, మొత్తం 20.175 టీఎంసీలకు గాను 20.100 టీఎంసీల నీటిలు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో కింద ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 1.35 లక్షల క్యూసెక్కుల వరకు వరద వస్తోందని తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 300 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, 20 గేట్ల నుంచి 1.30 లక్షల క్యూసెక్కులు గోదావరికి విడుదల చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసుల అత్యుత్సాహం

- ఒకరిపై లాఠీ ఝుళిపించిన పోలీసులు
- జిల్లా కేంద్రంలో ఘటన

మంచిర్యాలక్రైం: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించిన ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గౌతమినగర్‌కు చెందిన ఎండీ సాబీర్.. రంగంపేటలో ఎలక్ట్రీషియన్ వర్క్ చేసి ఆదివారం సాయంత్రం బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. బైపాస్‌రోడ్‌లో రాత్రి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సాబీర్ రాగా, పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. ఆయన ఆగకుండా ముందుకెళ్లగా కానిస్టేబుల్ లాఠీని అడ్డుపెట్టగా అతని గొంతుకు తగిలి కింద పడిపోయాడు. సాబీర్‌ను పైకి లేపి లాఠీ ఝుళిపించారు. స్థానికులు అతన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా, లాఠీని అడ్డం పెట్టలేదు. చెయ్యితో ఆపేందుకు ప్రయత్నం చేయగా కిందపడిపోయాడని తెలిపారు.